AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

14-10-2026 (Wednesday) MAIN EDITION

కర్ణాటకలో భారీ అగ్ని ప్రమాదం



అక్షరటుడే, కర్ణాటక : కర్ణాటకలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చిక్కబళ్లాపూర్ పరిధిలోని మాస్టెనహళ్లి కేఐఏడీబీ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఒక కర్మాగారంలో బుధవారం ఉదయం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరగడంతో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.

సీజేపీ నేతల అరెస్ట్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం



అక్షరటుడే, ఢిల్లీ : సీజేపీ నాయకుల అరెస్ట్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసనలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదు. దానికోసం యువతను జైలులో పెట్టడం పిరికిపంద చర్య అని రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. సీజేపీ, యువత, విద్యార్థులు, ఇండియా కూటమి నిరసనల జెండాలు వేరైనా లక్ష్యం ఒక్కటేనన్నారు.

ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ఢిల్లీ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం హైజాక్ ముప్పు ఉందనే అనుమానంతో భద్రతా హెచ్చరిక జారీ కావడంతో జైపూర్‌కు మళ్లించారు. పైలట్ మొదట హైజాక్ హెచ్చరిక జారీ చేయగా, బాంబు బెదిరింపు వచ్చినట్లు సమాచారం అందడంతో జైపూర్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా : డిప్యూటీ సీఎం భట్టి



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : అంతరాయం లేకుండా ప్రజలకు విద్యుత్ సరఫరా చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆయన విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బీహార్‌లో పడవ బోల్తా..



అక్షరటుడే, బీహార్ : బీహార్‌లోని వైశాలి జిల్లాలో గంగా నదిలో పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. రాఘోపూర్ ప్రాంతంలో పడవ బోల్తా పడింది. ఆ సమయంలో అందులో సుమారు 20 మంది ప్రయాణిస్తున్నారు. మరణించిన వారు అందరు 15 ఏళ్లలోపు పిల్లలే కావడం గమనార్హం.

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్ విషయంలో మేం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నామో వేచి చూడండి.. త్వరలోనే మా చర్యలు మీరే చూస్తారు" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. అలాస్కాలోని వాసిల్లా పట్టణంలో రిపబ్లికన్ అభ్యర్థుల తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ట్రంప్, ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాన్ని తయారు చేయకుండా అడ్డుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కేంద్రం నిధులు



అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణలో పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఇందిరమ్మ ఇళ్ల' పథకాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన (PMAY గ్రామీణ)' పోర్టల్‌తో అనుసంధానించే ప్రక్రియను హౌసింగ్ శాఖ ప్రారంభించింది. దీనిద్వారా అర్హులైన పేద లబ్ధిదారులకు కేంద్రం నుంచి భారీగా అదనపు ఆర్థిక సహాయం అందనుంది. మొదటి దశలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన 1.75 లక్షల ఇళ్లకు సంబంధించిన వివరాలను అధికారులు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు విడుదల కానున్నాయి. పీఎం ఆవాస్ యోజన కింద ఒక్కో ఇల్లుకు కేంద్రం నుంచి రూ. 72 వేల ఆర్థిక సహాయం లభిస్తుంది.



రాష్ట్రంలో పెట్టుబడులకు భరోసా

రాష్ట్రంలో పెట్టుబడులకు లాభదాయక వాతావరణం, భరోసా, అనుమతులు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. , పారిశ్రామికవేత్తలు తమ ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. హైదరాబాద్ నగరంలోని హైటెక్స్‌లో సమాఖ్య –2026 గ్లోబల్ బిజినెస్ మీట్‌లో సీఎం మాట్లాడారు. పెట్టుబడుల ప్రతిపాదనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన మంచి పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్ ■ సీఎం రేవంత్‌రెడ్డి ■ సమాఖ్య బిజినెస్ సమ్మిట్ ప్రారంభం

హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యో, సింగపూర్ వంటి ప్రపంచస్థాయి నగరాలతో పోటీ పడేలా అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు వచ్చినా దేశానికే మేలు జరుగుతుందని, పెట్టుబడులతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తాము ఎన్నికలప్పుడే రాజకీయాలు చేస్తామని, మిగతా సమయంలో అభివృద్ధిపై దృష్టి పెడతామన్నారు. దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రాల సహకారం అవసరమని నొక్కి చెప్పారు.

మహిళలను ప్రోత్సహించాలి

మహిళల భాగస్వామ్యం ఉన్న దేశాలే అత్యధికంగా ఆర్థికంగా బలపడ్డాయని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్థికంగా ఎదిగిన దేశాల్లో 50 శాతానికి పైగా భాగస్వామ్యం మహిళలదే ఉందని చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక యుగంలోనూ సమాఖ్యల అవసరం ఉందన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యం అన్నారు.

పరిశ్రమలు తరలిస్తాం

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం తెలిపారు. ఇక్కడ ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలను తరలిస్తామని తెలిపారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ 5 శాతం కంట్రిబ్యూట్ చేస్తోందని, దీన్ని 10 శాతానికి చేర్చాలనే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామన్నారు.



ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

అక్షరటుడే, ఏపీ : కడప పోలీసులు ఎనిమిది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద 1.984 టన్నుల బరువున్న 70 దుంగలతో పాటు, మూడు వాహనాలు, 643 కార్టన్ల కాఫీ పొడిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం విలువ సుమారు రూ. 1.30 కోట్లు ఉంటుందని జిల్లా ఎస్పీ నాచికేత్ విశ్వనాథ్ తెలిపారు.

హైదరాబాద్‌లో 'ఇండియా' కూటమి భారీ బహిరంగ సభ..



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా జాతీయ స్థాయిలో బలప్రదర్శనకు కాంగ్రెస్ అధిష్ఠానం రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల 24వ తేదీన విపక్ష 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో నగరంలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. రాబోయే రాజకీయ సమీకరణాలు, ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టడమే లక్ష్యంగా సుమారు లక్ష మంది జనసమీకరణతో ఈ సభను నిర్వహించేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) నేతలు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ బహిరంగ సభకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాగ్రాతో పాటు ఇండియా కూటమిలోని జాతీయ స్థాయి అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు.

డబ్ల్యూహెచ్‌వో కీలక నిర్ణయం..




అక్షరటుడే, నేషనల్ డెస్క్: మహిళల ప్రాణాలను తీస్తున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సిర్వికల్ క్యాన్సర్) మహమ్మారిని అరికట్టేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిపుణులు అత్యంత కీలకమైన సిఫార్సులు చేశారు. 4 నుంచి 8 ఏళ్ల వయస్సున్న చిన్నారి బాలికలకు హ్యూమన్ పాపిలోమావైరస్ (HPV) వ్యాక్సిన్ వేయాలని నిపుణుల బృందం సూచించింది. భవిష్యత్తులో ఈ ఘోర క్యాన్సర్ బారిన పడకుండా చిన్న వయసులోనే రోగనిరోధక శక్తిని పెంచి రక్షణ కల్పించడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యం.

జంతర్ మంతర్‌ను పునరుద్ధరిస్తాం




అక్షరటుడే, హైదరాబాద్: జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్య ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇది ఎన్డీఏ పాలకుల పిరికితనానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ధర్నా చౌక్‌ను ఎలా పునరుద్ధరించామో, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన వెంటనే జంతర్ మంతర్‌ను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్షరటుడే, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో అక్రమ నిర్మాణలపై అధికారులు ఉక్కుపాదం మోపారు. జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నిర్మాణాలను కూల్చివేశారు. శ్రీశైలం రహదారికి ఇరువైపులా తుక్కుగూడలో భారీగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి.బుధవారం ఉదయం నుంచి జేసీబీల సాయంతో అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ అధికారులను స్థానికులు అడ్డుకోడంతో ఉద్రిక్తత నెలకొంది

పంజాబ్‌లో సంచలనం సృష్టించిన ఫేస్‌బుక్ లైవ్ మర్డర్



అక్షరటుడే, పంజాబ్: పంజాబ్‌లోని మాన్సా జిల్లాలో తీవ్ర కలకలం రేపిన యాంటీ డ్రగ్ యాక్టివిస్ట్ పర్విందర్ సింగ్ జోటా హత్య కేసులో పోలీసులు వేగంగా స్పందించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ప్రధాన నిందితుడు, మెడికల్ షాప్ యజమాని అశ్విని కుమార్‌ను పంజాబ్, రాజస్థాన్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో రాజస్థాన్‌లోని సలాసర్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. మాన్సాలో ఓ మెడికల్ షాప్ యజమాని అశ్విని కుమార్ ఓ వృద్ధుడికి అక్రమంగా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నాడని ఆరోపిస్తూ పర్విందర్ సింగ్ జోటా ఫేస్‌బుక్ లైవ్ ద్వారా ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన అశ్విని కుమార్ తన వద్ద ఉన్న పిస్టల్‌తో పర్విందర్‌పై కాల్పులు జరిపాడు.

జెండా పట్టుకున్నందుకు జైలుకా?



అక్షరటుడే, ఢిల్లీ: దేశంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ అప్రకటిత ఎమర్జెన్సీని నడుపుతోందని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీపే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించిన తమ పార్టీ కీలక నేతలు సౌరభ్ దాస్, ఆశుతోష్ రాంకా, అజింక్యా షిండేలను పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పోలీసుల వెనుక దాక్కుంటూ పిరికిపంద రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు.